క్లుప్తంగా

సత్రం భూముల వేలం రద్దు చేయాలి


సత్రం వద్ద దీక్ష చేస్తున్న శ్రీనివాస్

రాజానగరం: స్థానిక రాజాకాంగ్రేగుల బహదూర్ పంతులు అన్నదాన సత్రానికి సంబంధించి తూర్పు గానుగూడెంలో ఉన్న 25.16 ఎకరాల వ్యవసాయ భూములకు ఈ నెల 15న జరిగిన వేలాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ మండల కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు ముప్పిడి శ్రీనివాస్ గురువారం సత్రం వద్ద నిరసన దీక్ష ప్రారంభించారు. ఐదు విడతలుగా జరిగిన వేలంలో రూ.5.16 లక్షలకు వేలం దక్కించుకున్న ఇద్దరు బినామీ వ్యక్తులు మరో రూ.11 లక్షలు తీసుకుని, సుమారు 80 సంవత్సరాలుగా ఆ భూములను అనుభవిస్తున్న పాత కౌలుదారుకే వాటిని ధారాదత్తం చేశారని ఆరోపించారు. దీనిపై కాకినాడలో దేవదాయ, ధర్మాదాయ శాఖ కమిషనర్‌కు ఫిర్యాదు చేసినా స్పందన లేకపోవడంతో దీక్ష చేపట్టినట్టు తెలిపారు. రూ.11 లక్షలు తీసుకున్న కూటమి శ్రేణులు పాటదారులతో కుమ్మక్కై ప్రభుత్వ ఆదాయానికి గండి కొట్టారన్నారు. ఈ భూములకు మళ్లీ వేలం నిర్వహించాలని కోరారు.

సాయిబాబాకు ప్రత్యేక పూజలు

బిక్కవోలు: మండలంలోని పందలపాకలో కొలువైన షిర్డీసాయి మందిరంలో గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఏకాదశిని పురస్కరించుకుని పండితులు మందిరంలో సాయిబాబాకు ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. అనంతరం బాబాకు ప్రత్యేక అలంకరణ చేశారు. గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ నాయకులు యాసలపు శ్రీనివాస్, క్రాంతి దంపతుల ఆధ్వర్యంలో అన్నసమారాధన నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

పెదపూడి: సత్యసాయి బాబా ఆరాధన మహోత్సవాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించాలని గండేపల్లికి చెందిన ప్రముఖ ఆధ్యాత్మిక వేత్త, విదవరేన్య ఆశ్రమం స్వామిజీ ప్రసాద్ వరన్య అన్నారు. స్థానిక సత్యసాయి సేవా సమితి ఆశ్రమంలో గురువారం సత్యసాయిబాబా ఆరాధన మహోత్సవం నిర్వహించారు. బాబాకు ప్రత్యేక పూజలు, గీతాపారాయణం, హోమం నిర్వహించారు. అనంతరం భక్తులకు భారీ అన్నదానం నిర్వహించారు. సత్యసాయి సేవా సమితి కాకినాడ జిల్లా అధ్యక్షుడు యార్లగడ్డ గోవిందరాజులు, మార్ని సత్యనారాయణ చౌదరి పాల్గొన్నారు.


రంగంపేట: మండలంలోని పలు గ్రామాల్లో గురువారం సత్యసాయి ఆరాధనోత్సవాలు ఘనంగా నిర్వహించారు. రంగంపేట, ఈలకొలను, కోటపాడు గ్రామాల్లోని సత్యసాయి మందిరాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముకుందవరం వృద్ధాశ్రమంలో అన్నదానం నిర్వహించి, పాదరక్షకులు పంపిణీ చేశారు. కోటపాడులో వృద్ధులకు అన్నప్రసాదం పంపిణీ చేశారు. సేవా సమితి కన్వీనర్లు మలిరెడ్డి వీర్రాజు, కందర్ప వెంకట అమరనాథ్, తిక్కిశెట్టి సుబ్బారావు, జిల్లా ఐటీ విభాగ సమన్వయకర్త పోతుల ఈశ్వరరావు, జిల్లా విద్యా విభాగ సమన్వయకర్త ఎల్. శ్రీనివాసరాజు పాల్గొన్నారు.

ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈకి ఉత్తమ సేవా పురస్కారం


మంగళగిరిలో డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న ఏఈ ప్రకాష్

సీతానగరం: మండలంలోని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ వాడ్రేవు సత్యసాయి ప్రకాష్‌కు ఉత్తమ సేవా పురస్కారం లభించింది. నేషనల్ పంచాయతీ రాజ్ దినోత్సవం సందర్భంగా గురువారం మంగళగిరిలోని సీకే కన్వెన్షన్ సెంటర్‌లో జరిగిన వేడుకల్లో డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ చేతుల మీదుగా ఆయన ఉత్తమ సేవా అవార్డు, ప్రశంసా పత్రం అందుకున్నారు. ఉత్తమ సేవ అవార్డు పొందిన ఏఈ ప్రకాష్‌ను ఎంపీడీఓ ఎం.భారతి, తహసీల్దార్ ఎ.శ్రీనివాస్, డిప్యూటీ ఎంపీడీఓ కేవీఎస్ఎస్ మూర్తి, ఏవో సుబ్రహ్మణ్యం తదితరులు అభినందించారు.

రూ.60 కోట్లతో సీసీ రోడ్ల నిర్మాణం


రోడ్డు రోలర్‌ను నడుపుతున్న ఎమ్మెల్యే బత్తుల

రాజానగరం: నియోజకవర్గంలోని మూడు మండలాల్లో రూ.60 కోట్లతో చేపట్టిన సీసీ రోడ్ల నిర్మాణ పనులు మే నెలాఖరుకు పూర్తి చేసేలా చర్యలు తీసుకున్నట్టు ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ తెలిపారు. రాజానగరం – అనపర్తి రూటులో మల్లంపూడి, ముక్కినాడ గ్రామాల మధ్య జరుగుతున్న రోడ్డు పనులను గురువారం ఆయన పరిశీలించారు. రోడ్డు రోలర్‌ను నడుపుతూ రోడ్డు పనుల నాణ్యత గురించి ఆరా తీశారు. అనంతరం ప్రజలతో మమేకమై సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట సంబంధిత అధికారులు, కూటమి నాయకులు ఉన్నారు.

విద్యార్థులకు హ్యాపీ డేస్ !

- పాఠశాలలకు వేసవి సెలవులు ప్రారంభం
- ఇంటి బాట పట్టిన హాస్టల్ విద్యార్థులు
- జూన్ 12న పాఠశాలల పునఃప్రారంభం


కొంకుదురు పాఠశాల నుంచి బుధవారం ఆనందోత్సాహాలతో బయటకు వస్తున్న విద్యార్థులు

బిక్కవోలు: ఏడాది పాటు పుస్తకాలతో కుస్తీపడ్డ విద్యార్థులు ఇక చదువులకు టాటా చెప్పి ఆటాపాటలతో నిమగ్నం కానున్నారు. పాఠశాల తరగతి గదుల్లో గడిపిన చిన్నారులకు వేసవి సెలవుల రూపంలో ఆటవిడుపు దొరికింది. విద్యా సంవత్సరమంతా తరగతులు, హోంవర్కులు, ట్యూషన్లు, పరీక్షలతో సతమతమైన విద్యార్థులు ఇక ఆహ్లాదాన్ని పొందనున్నారు. గురువారం నుంచి విద్యార్థులకు వేసవి సెలవులు ఇచ్చారు. బుధవారం విద్యా సంవత్సరం చివరి రోజు కావడంతో ఉపాధ్యాయులు వార్షిక ఫలితాలను ప్రకటించి, విద్యార్థులకు హోలిస్టిక్ ప్రోగ్రెస్ కార్డులు అందజేశారు. పలు చోట్ల ఉపాధ్యాయులు తల్లిదండ్రులతో సమావేశాలు ఏర్పాటు చేసి, విద్యార్థుల ప్రగతిపై చర్చించారు. ప్రభుత్వం వేసవి సెలవులు ప్రకటించడంతో అటు పుస్తకాల బరువు..ఇటు ఎండ వేడిమి నుంచి వీరికి ఉపశమనం లభించింది.

బ్యాగులతో స్వగ్రామాలకు...

ముఖ్యంగా తల్లిదండ్రులకు దూరంగా ప్రభుత్వ సాంఘిక సంక్షేమ, బీసీ వసతి గృహాల్లో ఉంటూ చదువుకుంటున్న విద్యార్థులు ఎగిరే పక్షుల్లా పుస్తకాలు, దుస్తుల బ్యాగులతో స్వగ్రామాల బాట పట్టారు. జూన్ 12న తిరిగి పాఠశాలలు పునఃప్రారంభమయ్యే వరకూ విద్యార్థులకు సెలవులతో సందడి చేసేందుకు వెసులుబాటు లభించింది. పుస్తకాలతో క్షణం తీరిక లేకుండా గడిపిన విద్యార్థులు బడులకు సెలవులు రావడంతో వేసవిలో ఏ విధంగా గడపాలో ఆలోచనలో పడ్డారు. కొందరు విద్యార్థులు సెలవుల్లో అమ్మమ్మ, తాతయ్య, నానమ్మ ఇళ్లతో పాటు బంధువుల ఇళ్లకు వెళ్లి వారితో సరదాగా గడుపుతామని చెబుతున్నారు. మరికొందరు తల్లిదండ్రులతో కలిసి వేసవిలో చూడదగిన ప్రదేశాలు, పుణ్యక్షేత్రాలు సందర్శనకు మొగ్గు చూపుతున్నారు.

నియోజకవర్గంలో...

అనపర్తి నియోజకవర్గంలో అనపర్తి, బిక్కవోలు, పెదపూడి, రంగంపేట మండలాల్లో ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలో 25 వేల మంది విద్యార్థులు పాఠశాల నుంచి బయటి వస్తున్నారు. వీరంతా ఇక ఆటపాటల్లో మునిగి తేలనున్నారు. మైదానాలు, పొలంగట్లపైన ఆటలు, నదులు, చెరువులు, కాలువల్లో ఈతలు కొట్టడంలో తలమునకలు కానున్నారు. రోజంతా ఇంచుమించుగా ఉత్సాహంతో గడపనున్నారు.

కోచింగ్‌కు రెడీ

ఈ వేసవి సెలవుల్లో తల్లిదండ్రులు తమ పిల్లలకు ఏదైనా కోర్సు నేర్పించాలని ఉవ్విళ్లూరుతున్నారు. ఇందులో భాగంగా కంప్యూటర్ శిక్షణ, స్విమ్మింగ్, క్రికెట్, భరతనాట్యం, కూచిపూడి, చదరంగం తదితర అంశాల్లో శిక్షణ కల్పించేందుకు సిద్ధమవుతున్నారు. వచ్చే విద్యా సంవత్సరానికి సంబంధించి సిలబస్‌ను వేసవి సెలవుల్లో బోధించేందుకు కొన్ని చోట్ల ట్యూషన్ సెంటర్లు వెలిశాయి.

సెలవులు వృథా చేయవద్దు



వేసవిలో విద్యార్థులు చదువులకు దూరంగా ఉండే అవకాశం ఉండడంతో సెలవు వృథా చేయకుండా అదనంగా ప్రయోజనం కలిగేలా వేసవి శిక్షణ శిబిరాలు ఉపయోగించుకోవాలి. విద్యార్థులు స్కిల్ డెవలప్‌మెంట్, సంగీతం, నృత్యం, చిత్రలేఖనం, కంప్యూటర్ శిక్షణ తరగతులు ఉపయోగించుకోవడం మంచిది.

పడాల వెంకటరెడ్డి,
విశ్రాంత్రి ఉపాధ్యాయులు, పందలపాక

ఎండలో తిరగవద్దు



సెలవు రావడంతో ఆటల కోసం విద్యార్థులు ఎండలో తిరుగుతారు. అలా తిరగడం వలన జ్వరం రావడంతో పాటు వడదెబ్బకు గురయ్యే అవకాశం ఉంది. వీలైనంత వరకూ ఉదయం 10 గంటల నుంచి సాయంత్ర 4 గంటల వరకు ఎండకు దూరం ఉంటే మంచిది.

పులగం రామానంద్ సాగర్,
చిన్న పిల్లల వైద్య నిపుణుడు, అనపర్తి

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

రాజానగరం: మండలంలోని శ్రీకృష్ణపట్నం–బొమ్మూరు 33 కేవీ విద్యుత్ ఫీడర్లలో మరమ్మతుల కారణంగా శుక్రవారం పలు గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏపీఈపీడీసీఎల్ ఇన్‌చార్జ్ ఈఈ నక్కపల్లి శామ్యూల్ తెలిపారు. పాతతుంగపాడు, శ్రీకృష్ణపట్నం, రాధేయపాలెం, శ్రీరాంపురం, రఘునాథపురం గ్రామాల్లో ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకూ విద్యుత్ సరఫరా ఉండదన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

సీతానగరం: మండల పరిధిలోని పలు గ్రామాల్లో శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని రాజమహేంద్రవరం ఏపీఈపీడీసీఎల్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ దాట్ల శ్రీధర్ వర్మ గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. మల్లయ్యపేట – పురుషోత్తపట్నం ఫీడర్ మరమ్మతుల కారణంగా మిర్తిపాడు, కాటవరం సబ్ స్టేషన్ పరిధిలోని 11 కేవీ ఫీడర్లకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామన్నారు. మిర్తిపాడు, ఉండేశ్వరపురం, ములకల్లంక, బొబ్బిల్లంక, కూనవరం గ్రామాలకు, అలాగే ఉప కేంద్రం పరిధిలోని వ్యవసాయ బోర్లు, ఇండస్ట్రీయల్ ఫీడర్‌కు ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

కోరుకొండ: స్థానిక విద్యుత్ సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా శుక్రవారం పలు గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ఈపీడీసీఎల్ ఈఈ దాట్ల శ్రీధర్‌వర్మ తెలిపారు. కోరుకొండ, కాపవరం, పశ్చిమగానుగూడెం, జంభూపట్నం, శ్రీరంగపట్నం, మునగాల, కోటి, కోటికేశవరం, బొల్లెద్దుపాలెం, గాదరాడ, కనుపూరు, రాజవరం గ్రామాల్లో ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకూ విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్టు తెలిపారు.

మంచి చేస్తారని ఓట్లు వేస్తే నిండా ముంచేశారు


- మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి
- దోమాడలో బాధితులకు పరామర్శ


దోమాడలో బాధితులతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే సూర్యనారాయణరెడ్డి

పెదపూడి: మంచి చేస్తారని నమ్మి ఓట్లు వేస్తే ప్రజలను నిండా ముంచేశారంటూ ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డిపై వైఎస్సార్ సీపీ కో ఆర్డినేటర్, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి ఆరోపణలు చేశారు. దోమాడలో రోడ్డు పక్కన నివసిస్తున్న సుమారు 8 కుటుంబాల గృహాలను కూల్చివేయడంతో బాధిత కుటుంబాలు రెండో రోజు గురువారం నిరవధిక దీక్ష చేశాయి. కాగా బాధితులను మాజీ ఎమ్మెల్యే సూర్యనారాయణరెడ్డి పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అవినీతి దాహం, అక్రమ సొమ్ములకు కక్కుర్తిపడి నిరుపేదలను రోడ్డున పడేశారంటూ ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డిపై ఆరోపణలు గుప్పించారు. బాధిత కుటుంబాలకు రూ.25 లక్షల నష్టపరిహారంతో పాటు ఇళ్లు నిర్మించి ఇవ్వాలని కోరారు. లేకుంటే మీరు లే అవుట్ యజమానితో లాలుచిపడినట్లు బాధితులు భావిస్తారన్నారు. రెండు రోజులుగా బాధితులు రోడ్డుపై రోధిస్తున్నప్పటికీ ఒక్క నాయకుడు, కార్యకర్త కూడా వచ్చి బాధితులను ఎందుకు పరామర్శించలేదని దుయ్యబట్టారు. మాల మహానాడు రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు సిద్దాంతుల కొండబాబు మాట్లాడుతూ దౌర్జన్యంగా ఏలాంటి నోటీసులు ఇవ్వకుండా గృహాలను కూల్చివేసిన అర్‌అండ్‌బీ, రెవెన్యూ, గ్రామ పంచాయతీ కార్యదర్శి, పోలీసులపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా నాయకుడు గుబ్బల ఆదినారాయణ, జైభీమ్ భారత్ పార్టీ రాజకీయ వ్యవహాల చైర్మన్ ఏనుగుపల్లి కృష్ణ, అనపర్తి ఏఎంసీ మాజీ చైర్మన్ సబ్బెళ్ల కృష్ణారెడ్డి, పార్టీ మండల కన్వీనర్ గుత్తుల రమణ, సర్పంచుల సమాఖ్య మండల కన్వీనర్ కోసూరి వాసు, నియోజకవర్గం ఎస్సీసెల్ కన్వీనర్ సాంబత్తుల చంటి ,కట్టా విజయరాజు, దున్నె అప్పారావు, డొకుబుర్ర కృష్ణ, పంపన వెంకటరమణ, చిట్టూరి సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

రైతులను నట్టేట ముంచిన కూటమి సర్కారు

- ధాన్యానికి కనీస మద్దతు ధర లేక రైతుల ఆందోళన
- ప్రభుత్వంపై ధ్వజమెత్తిన మాజీ ఎమ్మెల్యే సూర్యనారాయణరెడ్డి


విలేకరులతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే సూర్యనారాయణరెడ్డి

పెదపూడి: రైతులు పండించిన ధాన్యానికి కనీస మద్దతు ధర లేకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారని, రైతులను కూటమి ప్రభుత్వం నట్టేట ముంచుతోందని వైఎస్సార్ సీపీ కో ఆర్డినేటర్, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి అన్నారు. అనపర్తి వైఎస్సార్ సీపీ కార్యాలయంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో రైతులు పండించిన మొత్తం పంటను రైతు భరోసా కేంద్రాల ద్వారా మద్దతు ధరకు కొనుగోలు చేసేవారన్నారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వంలో రైతులు పండించిన ధాన్యంలో మూడో వంతు, లేక నాల్గో వంతు మాత్రమే కొనుగోలు చేస్తున్నారన్నారు. దీంతో రైతులు దిక్కుతోచని స్థితిలో ఆర్‌ఎస్‌కేల నుంచి మిగిలిన ధాన్యాన్ని వెనక్కి తెచ్చి రైసు మిల్లర్లకు విక్రయించుకోవాల్సి వస్తుందన్నారు. రైతులు పండించిన కొత్త రకం వంగడాలను కూడా ప్రభుత్వం కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం ధాన్యానికి మద్దతు ధర రూ.1725 ప్రకటించిందదని, ఆర్‌ఎస్‌కేల నుంచి వెనక్కి తెచ్చిన ధాన్యాన్ని రైతులు రూ.1550లకు రైసు మిల్లర్లకు విక్రయిస్తున్నారన్నారు. దీంతో ఒక్కొ బస్తా దగ్గర రైతు రూ.175 నష్టపోతున్నారని ఆరోపించారు. రైసు మిల్లర్ల అసోసియేషన్ పగ్గాలు కూడా ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, అనుయాయులకే అప్పగించారు. అనపర్తి నియోజకవర్గంలో నాలుగు మండలాల్లో ధాన్యం సేకరణ మందకోడిగా సాగుతుందన్నారు. ఆర్‌ఎస్‌కేల ద్వారా రైతులు పొందే మద్దతు ధరకు, మిల్లర్లు ఇచ్చే ధరకు మధ్య తేడా రూ.175 ఎక్కడికి పోతున్నాయని ప్రశ్నించారు. ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి మిల్లర్ల నుంచి ప్రతిఫలం ఆశించి ఈ విధంగా వ్యవరిస్తున్నారంటూ ఆరోపించారు. రైతు భరోసా, క్రాప్ ఇన్సురెన్ తదితర పథకాలను అమలు చేయకుండా కూటమి ప్రభుత్వం రైతులను మోసం చేస్తోందని విమర్శించారు.

పదో తరగతి, ఇంటర్ ఫలితాల్లో గాయత్రి ప్రభంజనం


పి. నర్మదా | పడాల వేదహర్ష | వైవీవీ అమృత | కె.ప్రసన్నజెస్సీ

రాజానగరం: మండలంలోని కానవరంలోని గాయత్రి విద్యా సంస్థల విద్యార్థులు పదో తరగతి, ఇంటర్మీడియెట్ ద్వితీయ సంవత్సర పరీక్ష ఫలితాల్లో అత్యుత్తమ ఫలితాలను సాధించారని కరస్పాండెంట్ వీవీఎస్ఎన్ మూర్తి, ప్రిన్సిపాల్ వి.దేవిబంగారం గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఇంటర్మీడియెట్ బైపీసీలో వెయ్యి మార్కులకు గాను పి.నర్మద 989 మార్కులు, ఎంపీసీలో పడాల వేదహర్ష 985 మార్కులు, మొదటి సంవత్సరం ఎంపీసీలో వి.ప్రియ 470 మార్కులకు 461 మార్కులు, బైపీసీలో ఎస్.సత్య 440 మార్కులకు 420 మార్కులు వచ్చాయన్నారు. పదో తరగతి పరీక్షలో వైవీవీ అమృత 577, కె.ప్రసన్నజెస్సీ 574, సీహెచ్ దివ్య 570 మార్కులు పొందారు. వీరితో పాటు 45 మంది విద్యార్థులకు 500లకు పైబడి మార్కులు వచ్చాయన్నారు. మొదటి శ్రేణిలో వంద మంది ఉత్తీర్ణులు కావడం గాయత్రీ విద్యా సంస్థలకే దక్కిందన్నారు.

ఉన్నత స్థానాలు అధిరోహించాలి

మాజీ ఎమ్మెల్యే సూర్యనారాయణరెడ్డి


అనపర్తిలో లీలాశ్రావణి, దేవిని అభినందిస్తున్న మాజీ ఎమ్మెల్యే సూర్యనారాయణరెడ్డి

పెదపూడి: విద్యార్థులు చక్కటి ప్రణాళికతో చదివి ఉన్నత స్థానాలు అదిరోహించాలని వైఎస్సార్ సీపీ కో ఆర్డినేటర్, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి ఆకాంక్షించారు. అనపర్తి వైఎస్సార్ సీపీ కార్యాలయంలో బిక్కవోలు మండలం పందలపాక గ్రామానికి చెందిన ఇద్దరు విద్యార్థులు ఇటీవల విడుదలైన ఇంటర్మీడియెట్ రెండో సంవత్సరం పరీక్ష ఫలితాల్లో ఉత్తమ ఫలితాలు సాధించారు. పందలపాక గ్రామానికి చెందిన ఆర్.మణికంఠ భార్య ఆర్.లీలా శ్రావణి ఇంటర్మీడియెట్ (సీఈసీ) రెండో సంవత్సరంలో పరీక్ష ఫలితాల్లో ప్రభుత్వ కాలేజీల స్థాయిలో రాష్ట్రంలోనే మొదటి స్థానం సాధించింది. ఇదే గ్రామానికి చెందిన పాలమూరి శివయ్య, వెంకటరత్నం దంపతుల కుమార్తె దేవి (ఎంపీసీ) పందలపాక ప్రభుత్వ కాలేజీలో ప్రథమ స్థానంలో నిలిచింది. వారిని మాజీ ఎమ్మెల్యే అభినందించి నగదు ప్రోత్సాహకాలు అందించారు. గ్రామ వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు సమకూర్చిన రూ.5 వేలు లీలా శ్రావణికి, పాలమూరి దేవికి రూ.2500 నగదు ప్రోత్సాహకాలు మాజీ ఎమ్మెల్యే చేతుల మీదుగా అందజేశారు. కార్యక్రమంలో అనపర్తి ఏఎంసీ మాజీ చైర్మన్ సబ్బెళ్ల కృష్ణారెడ్డి, పందలపాక గ్రామ కన్వీనర్ సత్తి హరిప్రసాద్‌రెడ్డి, ఎంపీటీసీ సభ్యులు కర్రి గీతా సతీష్ కుమార్, మచ్చా పాప, బొడ్డు ముత్యాలరావు, పడాల దుర్గారెడ్డి, గొలుగూరి అబ్బు, కర్రి ఇంద్రారెడ్డి, పాలచర్ల అబ్బు, వంకా శ్రీను, యాసలపు శ్రీనివాస్, రొంగల వెంకటేశ్వరరావు, షేక్ కరిముల్లా గండి వాసు తదితరులు పాల్గొన్నారు.

సీలింగ్ భూములు పేదలకు పంచాలంటూ ర్యాలీ


సీతానగరంలో భారీ ర్యాలీ చేస్తున్న రైతు కూలీలు

సీతానగరం: ప్రభుత్వ, సీలింగ్ భూములను నిరుపేదలకు ఇవ్వాలని కోరుతూ సీపీఐ (ఎంఎల్) రాష్ట్ర కార్యదర్శి పలివెల వీరబాబు ఆధ్వర్యంలో గురువారం రైతులు, రైతు కూలీలు ఎర్ర జెండాలతో భారీ ర్యాలీ నిర్వహించారు. సీతానగరం బస్టాండ్ సెంటర్ నుంచి నాలుగు బొమ్మల సెంటర్, పాత పోలీస్ స్టేషన్ మీదుగా తహసీల్దార్ కార్యాలయం వరకూ ర్యాలీ చేశారు. అక్కడ డిప్యూటీ తహసీల్దార్ సునీతకు సీపీఐ (ఎంఎల్) రాష్ట్ర కార్యదర్శి వీరబాబు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని సీలింగ్ భూములు, ప్రభుత్వ సొసైటీ భూములను అర్హులైన పేద ప్రజలకు పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఐ ఎంఎల్ నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు పలివెల జ్యోతి, మండల మహిళా అధ్యక్షురాలు కనితల రాధ, జిల్లా కమిటీ సభ్యులు నందమూరి చిట్టిస్వామి, మండల అధ్యక్షుడు సిద్దె నాగరాజు, రైతు కూలీలు పాల్గొన్నారు

ఉగ్ర దాడికి నిరసనగా కొవ్వొత్తుల ర్యాలీ

కోరుకొండ: జమ్మూకశ్మీర్‌లో తీవ్రవాదులు జరిపిన మారణకాండకు నిరసనగా మండల కేంద్రమైన కోరుకొండలో గురువారం రాత్రి కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. అధికారులు, ప్రజాప్రతినిధులు గ్రామంలో ర్యాలీ చేసి ఉగ్రవాదులు, పాకిస్తాన్‌కు వ్యతిరేకిస్తూ నినాదాలు చేశారు. ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ, కోరుకొండ సర్పంచ్ కర్రి లక్ష్మీసరోజ, టీఎన్‌టీయూసీ రాష్ట్ర డైరెక్టర్ తెలగంసెట్టి శ్రీనివాస్, ఎంపీడీఓ బత్తిన అశోక్‌కుమార్ పాల్గొన్నారు.

బిక్కవోలు: జమ్మూకశ్మీర్‌లోని జరిగిన ఉగ్ర దాడిలో అసువులు బాసిన మృతుల ఆత్మకు శాంతి చేకూరాలని కొంకుదురులో హిందూ ధర్మప్రచార సమితి ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. పాకిస్తాన్, ఉగ్రవాదులకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు.

పంచాయతీ వ్యవస్థతోనే గ్రామాల అభివృద్ధి

- ఘనంగా జాతీయ పంచాయతీ రాజ్ దినోత్సవం
- గ్రామాల్లో అవగాహన ర్యాలీలు


పెదపూడిలో ర్యాలీ నిర్వహిస్తున్న ఎంపీడీఓ, అధికారులు


బిక్కవోలు మానవహారంగా ఏర్పడిన అధికారులు

బిక్కవోలు: పంచాయతీ వ్యవస్థతోనే గ్రామాల అభివృద్ధి సాధ్యమని మండల పరిపాలన అధికారి రత్నకుమార్ అన్నారు. మండలంలోని బిక్కవోలులో గురువారం జాతీయ పంచాయతీ రాజ్ దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ స్థాయిలో అధికారులు అభివృద్ధి కార్యక్రమాలపై దృష్టి సారించాలన్నారు. పారిశుద్ధ్యం, తాగునీరు, పరిశుభ్రత సక్రమంగా పాటించాలన్నారు. అనంతరం మానవహారంగా ఏర్పడి ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలోని అధికారులు,అంగన్‌వాడీ, సచివాలయ, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

కోరుకొండ: పంచాయతీలు ప్రజలకు చేరువయ్యే విధంగా అధికారులు వ్యవహరించాలని బూరుగుపూడి పీఏసీఎస్ అధ్యక్షుడు కంటే నాగేశ్వరావు అన్నారు. పంచాయతీరాజ్ దినోత్సవాన్ని పురస్కరించుకుని బూరుగుపూడి పంచాయతీ కార్యాలయంలో కార్యదర్శి తాతపూడి జాకబ్‌రాజు అధ్యక్షతన గ్రామసభ నిర్వహించారు. పల్లెల అభివృద్ధికి పంచాయతీ రాజ్ వ్యవస్థ దోహదపడుతోందన్నారు. కోటికేశవరంలో సర్పంచ్ ముడే సింధూదివ్య అధ్యక్షతన గ్రామసభ నిర్వహించారు.

పాలనా వ్యవహారాల్లో పంచాయతీరాజ్ కీలక పాత్ర

రంగంపేట: స్థానిక పాలనా వ్యవహారాలను సమర్థంగా నిర్వహించడంలో పంచాయతీరాజ్ సంస్థలు కీలకంగా వ్యవహరిస్తాయని ఎంపీడీఓ వి. వీర సాయిబాబా అన్నారు. స్థానిక పంచాయతీ కార్యాలయంలో గురువారం కార్యదర్శి వెలిచేటి శ్రీరామమూర్తి అధ్యక్షతన జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ స్థానిక స్వపరిపాలన ప్రాధాన్యతను వివరించారు. అమరావతిలో జరిగే పంచాయతీరాజ్ దినోత్సవానికి మండలం నుంచి రంగంపేట, ముకుందవరం గ్రామాల సర్పంచ్‌లను ఆహ్వానించినట్టు తెలిపారు. కార్యక్రమంలో వార్డు మెంబర్లు, సచివాలయ సిబ్బంది, పంచాయతీ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

పెదపూడి: పంచాయతీరాజ్ వ్యవస్థ గ్రామాభివృద్ధికి వెన్నుముకగా పనిచేస్తుందని ఎంపీడీఓ కొవ్వూరి నరేంద్రరెడ్డి అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవం నిర్వహించారు. గ్రామంలో వివిధ శాఖాధికారులతో కలసి ర్యాలీ నిర్వహించారు. అనంతరం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ నరేంద్రరెడ్డి మాట్లాడుతూ పంచాయతీ అనేది గ్రామ స్థాయిలో అమల్లో ఉండే అతి ప్రాచీనమైన పాలన వ్యవస్థ అన్నారు. గ్రామాలు స్వయం ప్రతిపత్తి సంస్థలుగా ఎదగాలన్నారు. అధికారుల కృషితో గ్రామాల్లో వేగవంతమైన అభివృద్ధి జరుగుతోందని తెలిపారు. డిప్యూటీ ఎంపీడీఓ మేడపాటి సత్యనారాయణరెడ్డి, పంచాయతీరాజ్ ఏఈ శ్రీనువాసు, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ గంగాధర్, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ ఎం.శ్రీనివాసు, తదితరులు పాల్గొన్నారు.